

# సర్దుకుపోతే పోలా

సత్యవతి విశాఖపట్నం నుంచి ట్రాన్స్‌ఫర్ మీద వచ్చి హైదరాబాద్ ఆఫీసులో చేరింది. పద్మావతి సత్యవతికి సెక్షన్ ఆఫీసర్. నెల రోజుల తర్వాత గాని ఇద్దరి మధ్యా సాన్నిహిత్యం పెరగలేదు. సత్యవతికి నలభై ఐదేళ్ళుంటాయి. ఈ వయసులో కోరి ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వచ్చిందంటే పిల్లలకు పెద్ద చదువులో, ఉద్యోగాల గురించో అనుకునేది పద్మావతి. కాని అదేమీ కాదట. భర్తతో విభేదాలు కారణమట.

"మాకు ఒక్కమ్మాయే. పెళ్ళిచేశాం. అమెరికాలో వుంటోంది. మావారికి బుద్ధి రావాలని ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వచ్చాను." అని సత్యవతి చెప్పేసరికి పద్మావతి ఆశ్చర్య పోయింది.

"ఈ వయసులో మీ వారు బుద్ధిలేని పనేంచేశారు. కొంపదీసి ఏదైనా అక్రమ సంబంధం పెట్టుకున్నారా?" అని అడిగింది పద్మావతి.

"కాదు గాని ఆయన డోంట్ కేర్ మాస్టర్. ఇంట్లో సంగతులు ఏమీ పట్టించుకోరు. కాని అన్ని సౌకర్యాలు కావాలి. సరదాలు కావాలి. నేను జాబ్ చేస్తున్నానుగా ! నాకెలా కుదురుతుంది అంటే తెగ ఫీలైపోతారు".

"ఏమిటో నాకేం అర్థం కావడం లేదు."

"ఆయన పార్టీలని ఫ్రెండ్స్‌ని పిలుచుకొస్తారు. అందరికీ వంటచెయ్యమని బలవంతం చేస్తారు. ఇంట్లో తాగుడు వద్దంటే వినరు. ఇదేం తప్పుకాదు కూల్ డ్రింక్స్ తాగినట్లే అంటారు. ఇది తప్పుడు పనైతే గవర్నమెంట్ లైసెన్స్‌లు ఎందుకిస్తుంది? అని వాదిస్తారు."

"తాగి గొడవలు చేస్తారా?"

"అలా ఏం చెయ్యరు. అంతా పెద్ద మనుషులే కానీ నాకు చాలా ఇబ్బందిగా వుంటుంది. పోనీ హోటల్ నుంచి పదార్థాలు తెప్పించుకోండి అంటే వినరు ఫ్రెష్‌గా, రుచిగా వుండవంటారు. మా అమ్మాయి పెళ్ళయి వెళ్ళిన దగ్గర్నుంచి నాకు మనశ్శాంతి లేదు. నాకు విసుగు పుడుతోంది. కొన్నాళ్ళు దూరంగా వుంటే బుద్ధొస్తుంది అని మా అక్క నన్ను ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ చేయించింది." అన్నది సత్యవతి.

"మరి ఆయన గూడా ట్రాన్స్‌ఫర్ చేయించుకుని ఇక్కడికి వస్తే?"

"ఆయనకా ఛాన్స్ లేదు. హైదరాబాద్‌లో ఆయన పోస్ట్‌లు లేవు". అన్నది సత్యవతి.

సత్యవతి చెప్పినదంతా సిల్లీగా అనిపించింది పద్మావతికి. భర్తకున్న ఒక వ్యసనం కారణంగా ఈ వయసులో దూరంగా వుంచడంవలన ప్రయోజనం వుండదని ఆమె నమ్మకం పైగా నష్టం జరిగే అవకాశం వుంది. అప్పుడప్పుడు చేసుకునే పార్టీలే రెగ్యులర్ హేబిట్‌గా మారవచ్చు గూడా.

ఆర్నెల్లయినా సత్యవతి భర్త ఏమీ మారినట్లు లేదు. సత్యవతి బెట్టు సడలలేదు. కాని ఒంటరిగా జీవించడంలో వున్న అసౌకర్యాన్ని గమనిస్తున్నట్టుగా అనిపిస్తోంది. రోజూ పదికిలోమీటర్లు బస్సులో ప్రయాణించి రావడం. ట్రాఫిక్‌లో ఇరుక్కుని ఆఫీసుకి లేటుగా రావడం, తిరిగి వెళ్ళి ఒంటరిగా పలకరించే దిక్కులేకుండా వుండడం వలన ఆమెలో అసహనం మొదలైంది.

సంవత్సరం గడిచిన తర్వాత పద్మావతితో బాగా క్లోజ్‌గా మూవ్ అవుతూ తన కష్టాలన్నీ చెప్పుకుంటోంది.

"సత్యవతి చిన్నదాన్నో, పెద్దదాన్నో చెప్తున్నా విను. మీ ఆయనలో ఎటువంటి మార్పు కోరుకుంటున్నావో అది రాదని నా నమ్మకం." అన్నది సత్యవతి.

సత్యవతి విస్తుపోయి చూసింది.

"బాగా ఆలోచిస్తే నీది పెద్ద సమస్యకాదు తేలిగ్గా తీసుకుంటే ఎవరో ఒక పెద్దాయన చెప్పాడు మనిషి నలభై ఏళ్ళ తర్వాత ఇక తన పద్ధతి మార్చుకోడని. నాకు తెలిసిన ఒకటి చెప్తాను విను." అంటూ మొదలు పెట్టింది పద్మావతి.

శంకరయ్య మా బాబాయి. మా పిన్ని పార్వతి. వాళ్ళకి ఒక కొడుకు, కూతురు. పిల్లలకి పెళ్ళిళ్ళయిపోయి సెటిలైపోయారు. మా బాబాయి రిటైరైపోయాడు. మా బాబాయికి జిహ్వాచాపల్యం ఎక్కువ. మా పిన్నిది నీ సమస్యే. ఇప్పటికీ వీక్ ఎండ్ అని ఇంట్లో పార్టీలు పెడతాడు. అది వండు, ఇది వండు అని పిన్నిని సతాయిస్తాడు. ఒక రోజు నేను వెళ్ళేసరికి తన బర్త్‌డే అనీ ఫ్రెండ్స్ వస్తున్నారనీ, డిన్నర్‌కి వంట చెయ్యాలనీ అంటున్నాడు.

"ఈవాళ నా బర్త్‌డే. నీకు గుర్తుండి చస్తేగదా ! మా ఫ్రెండ్స్ ఫోన్‌చేసి హేపీ బర్త్‌డే చెప్పారు. వాళ్ళే నయం. రాత్రికి పార్టీ ఇవ్వాలి" అంటున్నాడు.

మా పిన్ని మండి పడింది.

"ఎందుకు చెప్పరూ హేపీ బర్త్‌డేలూ ! పార్టీల కోసం చేస్తారు. ఊరికే చేస్తారా? ముసలోడికి దసరా పండగని ఈ వయసులో పుట్టిన రోజులు అవీ, ఏంటండీ, బడాయి కాకపోతే?"

"రిటైరైపోతే ముసలోడైనట్లు లెక్కా ! ఇక కృష్ణా, రామా అని భజనలు చేసుకుంటూ గుళ్ళు, గోపురాల చుట్టూ తిరగాలా? నా వయసు అరవై. ఐతే ఏంటి? ఇరవై ఏళ్ళు వెనక్కెళ్ళి నలభైలో స్థిరపడింది."

"ఇదేం విడ్డూరం. అవతల అల్లుడు కోడలు, మనుమలు వచ్చాక ఇంకా తమరు కుర్రాడిలా ఫీలైపోతున్నారా? అంతా బడాయి మాటలు."

"నీకేం తెలుసే? ఇరవై నాలుగు గంటలూ కొంపలోపడి వుండేదానివి. పేపరైనా చదువుతావా? ఉహు..పోనీ టీ.వీలో న్యూస్ అయినా వింటావా? అదీలేదు. ఏడుపుగొట్టు సీరియళ్ళు చూస్తూ, కళ్ళు తుడుచుకుంటూ, ముక్కు చీదుకుంటూ వుంటావు. తెలుసుకో యావరేజి లైఫ్ ఇరవై ఏళ్ళు పెరిగింది. లోగడ నలభై నాలుగు వుంటే, ఇప్పుడు అరవై నాలుగు. అంటే ఇరవై ఏళ్ళు వెనక్కి పోవాలన్నమాట."

"ఇరవై ఏళ్ళు కాకపోతే నలభై ఏళ్ళుపోయి, పాతికేళ్ళ కుర్రాడిలా గంతులెయ్యండి. మీతోపాటు వెనకెళ్ళడం నావల్ల కాదు."

"సర్లే...సర్లే...పప్పు నానబొయ్యి, సాయంకాలం గారెలు వండు, రామ్మూర్తి, శేషారావు, గోపాల్‌రెడ్డి వస్తారు పార్టీకి. జీడిపప్పు వేయించి ఉప్పు, కారం చల్లు. నేను మార్కెట్‌కెళ్ళి చికెన్ తెస్తాను."

శంకరయ్య బాబాయి బయల్దేరి వస్తూ, నన్ను చూసి "నువ్వెప్పుడొచ్చావురా !" అన్నాడు నవ్వుతూ.

"హేపీ బర్త్‌డే బాబాయ్ !" అన్నాను.

"అంతా విన్నావన్నమాట. ఈవాళ ఇక్కడే వుండు. మీ పిన్నికి వంటలో సాయం చెయ్యి." అంటూ వెళ్ళిపోయాడు.

అలా ఏదొక వంకబెట్టుకుని పార్టీలని మా పిన్నిని సతాయిస్తుండేవాడు. మా బాబాయికి గారెలంటే మహా ఇష్టం. తింటే గారెలు తినాలి, వింటే భారతం వినాలని సామెతలు చెప్తుంటాడు. మీ బాబాయి గారెల పిచ్చితో చస్తున్నానే. కరెంట్ వుండి చావడం లేదు. పప్పు రుబ్బలేకపోతున్నాను. సమయానికి పనిమనిషి రాదు. చస్తున్నాననుకో. హోటల్లో తెచ్చుకోమంటే అవి రుచిగా వుండవంటాడు.

నేను నా బాధలు చెప్తుంటే మీ బాబాయి ప్రతి దానికీ ఏదొక వంక చెప్తాడు. కీళ్ళ నెప్పులు, కడుపు నెప్పులూ ! నీకంటే మా అమ్మనయమే. ఊరికెళ్తే రోట్లో పప్పురుబ్బి గారెలు చేస్తుంది. ఈ వయసులో గూడా. నువ్వప్పుడే ముసిలి డొక్కువైపోయావు అని ఎత్తి పొడుస్తాడు.

నేను వూరుకుంటానా 'మరింకేం వెళ్ళి వుండండి అమ్మ దగ్గర. పనీపాటా, ఉద్యోగం, సద్యోగం ఏం లేవుగా !' అంటాను. ఆ రోజువస్తే వెళ్తానే. నిన్ను దేబిరించుకుంటూ పడుంటానా అంటాడు కోపంగా !

"ఎక్కడ దొరికాడో మీ బాబాయి వట్టి తిక్కమాలోకం" అని మా పిన్ని గొణుక్కుంటూ వుంటుంది.

"సర్లే పిన్నీ ! ఎప్పుడైనా ఒక సారేగా !" అని వూరడిస్తాను.

"ఒకసారంటే వారం వారం ఇదే తంతు. అసలే షుగర్. నీరసం, తల తిరుగుడు వంట చూసుకోవడమే కష్టంగా వుంటే ఈ స్పెషళ్ళన్నీ ఎక్కడ చెయ్యనూ ! అర్థం చేసుకోడమ్మా మనిషి."

పిన్ని కనిపించిన వాళ్ళతో మా బాబాయి గొడవ చెప్తుంది. కొడుక్కి ఫోన్ చేసి చెప్తే "నా దగ్గరకు వచ్చెయ్యమన్నాడు. అమెరికాలో నాకేం తోస్తుంది? నావల్ల కాదు అంటుంది. నువ్వు అన్నిటికి అన్నీ చెప్తావు. ముసలితనంలో చాదస్తం పెరుగుతుంది. ఏం చేస్తాం. సర్దుకుపోవాలి." అంటాడు.

సరే మా పిన్నికి ఎవరో సలహా ఇచ్చారు. నీ కష్టాలు తీరేవి కావు. వృద్ధాశ్రమంలో చేరిపోండి. అక్కడ వంటా, పెంటా వుండదు. భార్యాభర్తలకి సపరేట్‌గా రూమ్ ఇస్తారు. హాయిగా వుంటుంది అని. మా పిన్ని ప్రపొజల్ విని మా బాబాయి ఇంతెత్తు ఎగిరిపడ్డాడు. శివతాండవం చేశాడు. తనసలు ముసలోడే కాదన్నాడు. నువ్వు ముసలి దానివైపోయావు. కావాలంటే నువ్వు వెళ్ళు అని వెటకారం చేసేసరికి మా పిన్నికి బి.పీ. పెరిగిపోయింది.

"నువ్వెళ్ళి ఆశ్రమంలో చేరిపో... ఆయనగారి తిక్క కుదురుతుంది. వండిపెట్టే దిక్కులేక పరిగెత్తుకొస్తాడు". అని వాళ్ళు వీళ్ళు సలహా ఇచ్చారు. మా పిన్ని తిరుగుబాటు చేసి ఆశ్రమంలో చేరిపోయింది.

"మరి మీ బాబాయి ఏం చేశాడు? ముసలి వయసుగదా? చాలా ఇబ్బంది పడి వుంటాడే? దారి కొచ్చాడా?" అడిగింది సత్యవతి.

"అదే చెప్పబోతున్నా ! కుక్కతోక వంకర అంటారే ! అలాగ అన్నమాట మగాళ్ళ బుద్ధి. ఆ వంకరపోయేది కాదు." అని తర్వాత కథ చెప్పసాగింది పద్మావతి.

మా పిన్ని ఆశ్రమంలో చేరిన కొత్తలో నేనూ వెళ్ళాను. అప్పుడు తనకు హాయిగా వున్నట్లు చెప్పింది పిన్ని. ఏ పనీ చెయ్యక్కర్లేదు. వంటపని లేదు. సమయానికి అన్నీ తెచ్చి పెడుతున్నారు.

నెల గడిచింది. మా బాబాయి అటువైపు తొంగి చూడలేదు సరికదా ఫోన్ గూడా చేసి క్షేమ సమాచారాలు అడగలేదు. మా పిన్ని గూడా మొండిగా వుంది. తను గూడా ఫోన్ చేసి ఎలా వున్నారని అడగలేదు.

మూడు నెలలు గడిచేసరికి మా పిన్ని మనసు ఆగడం లేదు. అన్నీ అమురుతున్నా ఏదో లోటుగా వుంది. అది భర్త దగ్గరలేనిలోటే అని తెలుసుకోగలిగింది. ముప్పై ఐదేళ్ళ పాటు కష్టసుఖాలు అనుభవించి ఇప్పుడు విడిగా వుండడం ఆమెకు కష్టంగానే వుంది. తను బాబాయిని బెదిరించడానికి ఆశ్రమంలో చేరింది గాని శాశ్వతంగా దూరం కావడానికి కాదు గదా ! తను లేని లోటు తెలుసుకుని వచ్చి బ్రతిమాలతాడనీ, తాగుడు అలవాటు మానుకుంటానని ప్రామిస్‌చేసి తీసుకెళ్తాడనీ అనుకుంది.

కాని ఆ మనిషిలో ఏ మార్పు కనపడకపోయే సరికి తనే మెట్టుదిగింది. భర్త ఏం ఇబ్బందులు పడుతున్నాడో? తిక్కమనిషి. తనలాగే మొండిగా, పట్టుదలతో కాలం గడుపు తున్నాడేమో? అసలే జిహ్వాచాపల్యం ఎక్కువ. హోటల్లో రుచీ పచీలేని తిండి ఎలా తింటు న్నాడో? అని మదనపడసాగింది.

ఆడది ఏనాటికైనా తగ్గి వుండాల్సిందే ఏం చేస్తాం అని సమాధానపడి ఒక రోజు ఉదయమే బయల్దేరి ఇంటికి వెళ్ళింది.

మా పిన్ని వెళ్ళేసరికి పదహారేళ్ళ పిల్ల వాకిట్లో ముగ్గులేస్తూ కనపించింది.

"హు... పనిపిల్లను పెట్టుకున్నట్లున్నాడు." అనుకుంటూ లోపలకు వెళ్ళింది.

డైనింగ్ టేబుల్ ముందు కూర్చుని టిఫిన్ తింటున్నాడు మా బాబాయి. వంట గదిలో నుంచి పెసరట్లు కాలుతున్న వాసన ఘుమ ఘుమలాడుతోంది. నలభై ఏళ్ళున్న ఆమె ఎవరో పెనంమీద పెసరట్లు పోస్తోంది.

మా పిన్నిని చూసి ముసి ముసి నవ్వులు నవ్వాడు బాబాయి.

"ఏంటే పార్వతీ అప్పుడే పెట్టె బేడా సర్దుకుని వచ్చేశావు ! అక్కడ బోర్ కొట్టిందా?" అన్నాడు వెటకారంగా.

వంటావిడ వేడి వేడి పెసరట్లు ప్లేటులో వేస్తూ మా పిన్నిని చూసింది ప్రశ్నార్థకంగా.

"ఇదే మా ముసలమ్మ. అలిగి ఆశ్రమానికెళ్ళిందిలే. అమ్మా, నాన్నా బతికున్నప్పుడు అలిగి పుట్టింటికి పోయేది." అన్నాడు బాబాయి.

"పిచ్చాసుపత్రిలో వుందన్నారుగా అయ్యగారూ ! ఆశ్రమం అంటారేందండీ?" అని అడిగింది వంటావిడ.

"ఆశ్రమం గూడా పిచ్చాసుపత్రేలే. పిచ్చి కుదిరితే ఇంటికి పంపిస్తారు." అని పక పకా నవ్వేసరికి మా పిన్నికి కోసం నషాళానికంటింది.

కాని ఏం చేస్తుంది పాపం. పిలవని పేరంటానికెళ్ళినట్లు, రమ్మనకుండానే వచ్చిందామె.

"ఇప్పుడు వంట్లో బాగున్నదా అమ్మగారూ ! కూకోండి. నాలుగు అట్లు వేస్తాను." అన్నది వంటామె.

"వెనకటికి నీలాంటి ముసలమ్మ నా కోడి, కుంపటి లేకపోతే వూళ్ళో తెల్లారదని అలిగి పోయిందట." అని వెటకారం చేశాడు మా బాబాయి.

"అమ్మగారు పిచ్చాసుపత్రి నుంచి ఇక రాదన్నారుగా ! మళ్ళీ పెళ్ళిచేసుకుంటా నన్నారుగా ! అమ్మగారు వచ్చేసిందిగా ! ఐతే ఇక పెళ్ళిచేసుకోరా అయ్యగారూ ! అంటోంది వంటామె.

మా పిన్నికి బి.పి. రెయిజైపోయిందని వేరే చెప్పాలా?" అంటు పద్మావతి చెప్పడం ముగించింది.

సత్యవతి అదంతా విని బిక్క చచ్చిపోయింది.

"అందుచేత సత్యవతీ నీ భర్త నువ్వులేవని విరహవేదన పడతాడనీ, హోటల్ తిండి తిని చిక్కి శల్యమైపోయి నీకోసం వెతుక్కుంటూ వస్తాడని భ్రమపడకు." అన్నది పద్మావతి.

సత్యవతిలో ఆ భ్రమ ఎప్పుడో తొలిగిపోయింది. అరవై ఏళ్ళాయనే అంత దర్జా వెలగపెడితే, ఏభై ఏళ్ళాయన ఇంకెన్ని వేషాలైనా వేస్తాడు అనుకుంది.

"ఈ మధ్య ఎక్కడో చదివాను సత్యవతీ, మగాడు ఆడదాని మీద డామినేట్ చెయ్యడం జంతు దశ నుండీ వుందట. నీకు తెలుసుగా మనిషి పూర్వం నాలుగు కాళ్ళతో నడిచే చింపాజీ జాతివాడని."

సత్యవతి తలవూపింది.

"అందువల్ల శాస్త్రవేత్తలు చెప్పేదేమంటే స్త్రీల మీద డామినేట్ చెయ్యడం మనిషి తన తాత ముత్తాతల కాలం నుంచీ వుంది."

సత్యవతి పద్మావతి చెప్పేదంతా స్టూడెంట్‌లా చేతులు కట్టుకుని వింటోంది.

"మగ చింపాంజీలు ఆడ చింపాజీలను చెట్టుకొమ్మలు విరిచి మరీ బాదుతాయట. జీన్స్ అంటారే ! అవి ఎక్కడికి పోతాయి? కొద్దో గొప్పో వస్తాయి గదా ! ఆదీ అసలు కారణం. మనిషి ఎంత చదువుకున్నా, ఎంత సంస్కారం నేర్చుకున్నా స్త్రీల విషయంలో మారకపోవడానికి జీన్స్ కారణమేమో? ఏమంటావు?" అన్నది పద్మావతి.

పాపం సత్యవతి ఏమంటుంది?

"నా ఖర్మ. నేనే మళ్ళీ ప్రయత్నం చేసుకుని విశాఖపట్నం వెళ్ళాలి. ఏంచేస్తాం ఆడపుటక పుట్టాక" అంటుంది. సర్దుకుపోవాలి మరి !

*-జనవికాస్ వారపత్రిక 10-10-2008*